# శాపశక్తి

జంధ్యాల జానకిరామశర్మగారు

౧

శ్రీమాన్ జ్ఞానశూన్యతర్కాచార్యులుగా రొకదినమున తనపట్టశిష్యుఁడగు తమసాకారునితో నిట్లనిరి. "నాయనా! మావిషయ మంతయు నీకు బాగుగఁదెలియును గదా! మేము శాస్త్రవిదులము, జ్ఞానులము, అగుటచే నిప్పుడీకలియుగములోనైనను క్రోధముగలిగెనేని ప్రపంచమునంతయు నొక్కపెట్టున భస్మము చేయగలశక్తి మాకున్నది. తెలిసితివా?"



జ్ఞానశూన్యుఁడను పేరఁబరఁగుఁదన గురునియొక్క యిట్టి జ్ఞానపూర్ణభాషణము విని నంతనే తమసాకారుఁ డాశ్చర్యమగ్నమానసుఁడై యిట్లనియె: "గురువుగారూ! నేఁడెట్టి సంతోషవార్త వింటిని! తమకుఁగల యాసామర్థ్యము నుపయోగించుటకిదియదను. శారదాక్రేరారు లనువారిరువురు బయలుదేరి ధర్మహీనులై సంఘసంస్కర్తల మనుబేరువెట్టికొని హిందూమతాచారములను మంటఁగలుపుచున్నారు. ఆ రాక్షసులను తమ క్రోధాగ్నిజ్వాలలచే దహించివేయుదురేని లోకమంతయుఁ దమకెంతయుఁ గృతజ్ఞతఁజూపఁగలదు."

జ్ఞానశూన్యుని యదార్థనామము జ్ఞానశంకరతర్కాచార్యులు. శిష్యుని పేరు ప్రకాశచంద్రుఁడు. కాని తమతమ గుణానుగుణ్యముగ జ్ఞానశూన్యుఁడనియు, తమసాకారుఁడనియుఁ బేరులొంది యట్టులే పిలువఁబడుచుండిరి.

శిష్యునినోటినుండి శారదాక్రేరారుల పేరులు విని యాచార్యుఁ డదరిపడి, "నిజమే! సమయమునకు జ్ఞాపకముచేసితివి. నాశక్తిసామర్థ్యము లిత్తఱిఁబ్రపంచమునకెల్ల వెల్లండిచెద. ఇదిగో! విను. జ్ఞానశంకరతర్కాచార్యులుగారు నేఁటిసాయంకాలమున నాఱుగంటలకు శారదాక్రేరారులను ధర్మద్రోహుల నిరువురను గంగాతటమున భస్మీభూతులఁజేయుదురు. కాన సనాతనధర్మరక్షకులెల్లరు విచ్చేయఁబ్రార్థితు"లను నొక ప్రకటన నచ్చొత్తించి యూరిలోఁ బంచిపెట్టు'మని యాజ్ఞాపించెను.

అంతులేనియానందముచే నుప్పొంగి తమసాకారుఁడిట్లనియె, "గురుదేవా! వారిని గంగాతీరమున భస్మముచేయనెంచితిరా! అట్లగుచో వారికి మోక్షప్రాప్తి గలుగునుగదా! అట్లుకాదు. వారిని మ్యునిసిపల్ పెంట దిబ్బలు, మురికినీటిగుంటలు, నిమ్నజాతులవారుండు నపవిత్రస్థలములలో భస్మముచేయుదురుగాక యని నాప్రార్థన."

అనంగీకారసూచకముగా నొక్కింతయోజనచేసి మఱల నేమనుకొనెనో గాని యాచార్యుఁడిట్లనెను. "సత్యమే! నాయూహప్రకారము వారికి నిష్కారణముగా మోక్షము లభించుననుట నిక్కము. నీయూహ మిక్కిలి చక్కగానున్నది. ఇట్టివాఁడవుగనుకనే నిన్ను పట్టశిష్యునిగా గ్రహించితిని."

తనహాస్యవచనమును యథార్థమనుకొని సంతసించిన గురువునుజూచి నవ్వుకొనుచు శిష్యుఁడచ్చటినుండి పోఁబోవుచుండెను. ఇంతలో నాచార్యుఁడాతనిఁ బిలిచి చెవిలో మెల్లగానిట్లనెను. "పత్రికలను మిగులఁ దెలివితోఁ బంచిపెట్టవలెను సుమా! ఖద్దరువస్త్రములు ధరించినవారికిని, తలలో మాలజుట్టు (Croping) పెట్టుకొనియుండువారికి మాత్రము పత్రికలీయకుము. తెలిసినదా? ఏలయన—"

"ఆచార్యవర్యా! తావకపాదపద్మసంసేవనాలబ్ధధీవిశేషమున నాకంతయుఁ దెలియును." అనిపలికి శిష్యుఁడచటినుండి వెడలిపోయెను.

౨

సాయంసమయమున సభ యేర్పాటుచేయఁబడెను. ఒక ముఱికిదిబ్బపై నొకగొంగళియు, దానిపై నొకకంబళియు వేయఁబడెను. తర్కాచార్యులు, వ్యాకరణాచార్యులు, పురాణాచార్యులు, జ్యోతిషాచార్యులు,దర్శనాచార్యులు, ధర్మాచార్యు లాదిగాఁగల పండితంమన్యులందఱు దానిమీఁద నాసీనులైరి. మూలగా నొకబల్లపై శారదాక్రేరారుల ఛాయాపటము లుపస్థితసభాసదులకుఁ జక్కగా నగుపడులాగున సమర్పఁబడియుండెను. తర్కాచార్యుఁడధ్యక్షపీఠము నలంకరించియుండెను. చుట్టుప్రక్కలనుండు నిమ్నజాతుల వారా సభాకార్యక్రమము నవలోకించుటకై నిలిచియుండిరి. "మహాత్మాగాంధీగా రస్పృశ్యతాపిశాచమును రూపుమాపుటకై యంటరానివారనఁబడువారిని తమసోదరులవలె ప్రేమించుచున్నట్లే, వీరును నంటరానితనము నందలి భేదభావమును నిర్మూలింపఁ గంకణముగట్టుకొనిరా యేమి?" యని సభికులు తొలుతఁదలఁచిరి, కాని వెంటనే తమ యభిప్రాయమును మార్చుకొనవలసినవారైరి.

కాలక్రమమున నింకను గొందఱు వచ్చిచేరిరి. ఆగుంపులో స్వదేశివస్త్రములు ధరించిన యువకుఁడొకఁడుండెను. వానిని జూచినంతనే యాచార్యులుగారు శిష్యునిచెవిలో "నేననుకొనినంతఁ జేయనేచేసితివి! ఖద్దరుబట్టలు ధరించినవారి నాహ్వానింపవలదని చెప్పితినా లేదా? ఇప్పుడేమైనదో చూచితివా? అట్టి ధర్మహీనుఁడగు రాక్షసుఁడొకఁడు రానేవచ్చెను! ఇప్పుడేమిచేయుదరి?''మనెను.

"అయ్యా! తమరు కంగారుపడకండి. ఇతఁడు మనవంటివాఁడుకాఁడు. వానిని మనమేమియు ననఁబనిలేదు. ఈస్థలమాహాత్మ్యమే వాని నిచటనుండి తఱిమివేయఁగలదు. అతడు త్వరలోనే పారిపోఁగలడు.

"ఒకవేళ వీఁడిచటినుండి పారిపోకున్నచో నపుడేమిచేయుదువు?"

"తమ రుపదేశించిన వేదములేదా? బిగ్గరగా వేదశ్లోకముల నుచ్చరించి వీనిమాట లొరులకు వినఁబడకుండఁ జేసెదను."

"ఓరీ! తెలివితక్కువ పెద్దమ్మా! శూద్రులవద్ద వేదముపఠించెదవా? నీతెలివి తగులఁబడినట్లేయున్నది. అయ్యయ్యో! మ్లేచ్ఛులుగూడ వచ్చియున్నారే! వీరికిని విజ్ఞాపనపత్రికలనిచ్చితివా? మొత్తమునకిది యంతయు నవరమునకేనుమా"

"స్వామీ! యిట్టివారికిఁ బత్రికలనీయ నేనంత బుద్ధిహీనుఁడనా? వారే నాచేతిలోని కాగితములు లాగికొనిరి."

౩

సభాకార్యక్రమ మారంభింపఁబడెను. దేశికుని యాజ్ఞానుసారము శిష్యుఁ డిట్లుపన్యసించెను.

"...తపస్సంపన్నులకాకరమై తపోభూమియని పేర్గాంచిన పవిత్రభారతదేశమునందుఁ గలియుగమున నీనాఁటికిఁ బాపాత్ము లనేకులు జన్మించి సంస్కర్తలమని విఱ్ఱవీగుచు మతవిషయములందుఁ బ్రవేశించి ధర్మ

విధ్వంసకులై, ప్రపంచమున ధర్మమనుమాటగూడ నాశనముగావలయునని (ధర్మమన నెట్టిది యని సభలో ప్రశ్న) ధర్మమన నేమియో వేదశాస్త్రపురాణములయందే చెప్పఁబడియున్నది. అది యాంగ్లగ్రంథముల యందు లభింపదు. వానిలోని శ్లోకములను చతుర్థులవద్ద పఠింపఁగూడదు. అయినను ఒక్కవిషయము మాత్రము చెప్పెదను. మన పూర్వీకు లేమార్గము నవలంబించుచుండిరో, యామార్గముల మన మనుసరించుటే ధర్మమనఁబడును."

ఒకఁడు:—"మన పెద్దలందఱొకేమార్గ మవలంబించిరా? వారిలో మతభేదములు లేవా?"

"వారిలో మతభేదములున్నవని నీవెట్లు చెప్పఁగలవు?"

"శాస్త్రములయందే వలయునన్ని మతభేదములున్నవి."

ప్రశ్నోత్తరములు తుదకు జగడముగా పరిణమించు నేమోయని భయపడి యధ్యక్షుఁ డిట్లు పలికెను.

"వినుఁడు, వినుఁడు. మీతాతముత్తాతలకాలమున నొకజాతివాఁ డింకొకజాతిపనులొనరించియుండెనా? ఏజాతివాఁ డాజాత్యుచితకార్యము లాచరింపవలయునను విషయ మెల్ల రంగీకరించుచున్నారు. పురాకృతపుణ్యాపాపముల ననుసరించి జననములు గల్గునని మీరందఱొప్పుకొనుచున్నారా లేదా? ("అవశ్యము" అని కొందఱు, "ఎన్నటికిఁగాదు" అని మఱికొందఱు.)

"అయ్యా! మీభాషణము చాలింపుఁడు. పుణ్యాపాపములననుసరించి జన్మలు లభించుటలేదు. జాతిభేదములు మానవనిర్మితములేగాని భగవన్నిర్మితములుగావు" అని ఖద్దరువస్త్రధారియగు యువకుఁడు బిగ్గరగాఁ బలికెను.

"బ్రహ్మక్షత్రియవైశ్యశూద్రులలో నధికసంఖ్యాకులు మాభావముతో నేకీభవించియేయున్నారు. వారందఱికిని జీవయాత్ర జరుగుచునేయున్నది."

"ఈరోజులలోఁ బూటగడుపవలయు నన్న మోసమువలనఁ బ్రయోజనములేదు. అధర్మజాలము పటాపంచలగుదినములు వచ్చియున్నవి. సుశిక్షితప్రజ లేజాతివారైనను—కనీసము యువకసముదాయమైనను—మీయుద్దేశ్యములతో నేకీభూతులు గాఁజాలరు."

ఇప్పుడు జ్ఞానశూన్యులుగా రెంతయు నావేశపూరితులైరి. చేతులునలుపుకొనుచు లేచినిలిచి యుద్రేకముతో నిట్లనిరి. "సంఘసంస్కర్తలిప్పుడు మన మతాచారములపైకి దారుణముగా దాడివెడలియున్నారు. దానికి మనముచేయవలసిన ప్రతిక్రియయేమన ధర్మయుద్ధ మవలంబింపవలెను. బాలబాలికల కందఱికిని వివాహములు చేసివేయవలెను. చతుర్యుగములయందును హిందూధర్మముయొక్క ముఖ్యోద్దేశ్యము వివాహమే. కాన నైదేండ్లప్రాయముగల బాలిక కారేండ్ల బాలునొకని వెదకుఁడు, లభింపనిచో నాలుగేండ్లవానిని జూడుఁడు. అట్టివాఁడును దొరకఁడేని వివాహములాపి మిన్నకుండక యేఁబదిసంవత్సరముల వానికైననిచ్చి పెండ్లిచేసి వేయుఁడు. ఏఁబదిసంవత్సరములవాఁడు ముసలివాఁడనుకొందురేమో! ఎన్నటికిఁగాదు. ఇంతయేల? నన్నుఁ జూడుఁడు. నాకిప్పు డేఁబదియైదేడుల వయస్సు. నే నేమైన వృద్ధుఁడనుగాఁ గనఁబడుచున్నానా? ఈశ్వరుఁ డనుగ్రహించెనా? అఱువదేడులవానికైనను సంతానప్రాప్తిగలుగును."

"స్వామీ! సంతానమునిచ్చువాఁడు భగవంతుఁడా? అగుచోఁ గొందఱు సంతానహీనులగుదురే! వారు భగవానునకేమి యపకృతి యొనర్చిరి? భగవంతుఁడు వ్యభిచారులకును, పాపాత్ములకును సంతతి నీయనేల? అఱువదేడుల ప్రాయమున సంతానమెందఱికిఁ గల్గెను? ఒకవేళ కలిగినను నెవరికి గల్గెనో కొంచెము చెప్పఁగలరా?"

"గురువుగారూ! ఇతఁడు నాస్తికుఁడట్లున్నాఁడు. వీనిమాటలు వినుటయే ఘోరపాపము. 'హరిహరాదులనింద లాలకించుటలెల్ల, కోటిగోవధములకున్ సమంబు.'"అని తమ సాకారుఁడనియెను.

"నేను నాస్తికుఁడనా? ఈశ్వరేచ్ఛలేకయే మాట్లాడుచున్నానా? అట్లగుచో నాశక్తియతీతమైనదే! ఏదియెట్లున్నను, నీవైజ్ఞానికయుగములో నీశ్వరుఁడు, ధర్మమను పేరులలోఁ జిక్కించి లోకులను వెఱ్ఱివారిఁ జేయఁజూచు యోజనలను విడిచిపెట్టుఁడు. అదెన్నఁడును నెఱవేఱఁజాలదు. ఈకాలములో మోసఁపుఁబనులు సాగిరావు. ఇది ముమ్మాటికి సత్యము. కావున నిప్పటికైనను మతాచారాంధకారమునుండి సత్యజ్ఞానప్రకాశములోనికివచ్చి యీదురాగ్రహము నీహఠవాదమును మానివేయుఁడు. మన భారతీయులనుఁజూచి ప్రపంచమంతయు నిప్పటికే నవ్వుచున్నది."

అంత జ్ఞానశూన్యులుగారు గంభీరస్వరమున నిట్లనిరి. "ప్రపంచమంతయు జ్ఞానహీనమైపోయినది. అందఱికి విజ్ఞానమంత సులభలభ్యమగునది గాదు. జ్ఞానమున కందఱధికారులుగారు. ప్రపంచమున హిందూధర్మముల నంగీకరించు వారదృష్టవశమున నిప్పటి కెక్కుడుగనేయున్నారు."

"ఇది కేవలము సత్యదూరము. ప్రపంచమునఁ గ్రైస్తవమతానుసారు లన్నిమతములవారికన్న నెక్కువగనున్నారు. క్రైస్తవులు రామకృష్ణాదిదేవతల నెంతగ నిందించుచున్నారో తెలియునా? హిందువుల నెట్లు గేలిచేయుచున్నారో యెఱుఁగుదురా? అట్టివారికి వాగ్బంధము చేయుటే మాయటుంచి—"

తమ:—"అయ్యా! ఇది సభయని తెలియునుగదా! వాదప్రతివాదముల కిచట చోటులేదు. మధ్యమధ్య మీరిట్లూరక మాట్లాడుచుండెదరేల? ఎల్లరును తర్కాచార్యదేశికుని యుపదేశముల శిరసావహింతురుగాక! ధర్మయుద్ధముచేయ బద్ధకంకణులగుదురుగాక! ప్రభుత్వమువారు మనలఁ గారాగృహముల నిర్బంధింతురా? మంచిదే! అప్పుడు మనయీయుద్యమమహీజ మెట్లువృద్ధియై ఫలవంతమగునో తెలిసికొనగలరు.

"తమ రందఱేదినమునఁ బ్రభుత్వమువారిచే నిర్బంధింపఁబడి సంతోషపూర్వకముగా శ్రీకృష్ణజన్మస్థాన మలంకరింతురో, ఆదినము మిగులఁ బవిత్రమైనదై హిందూదేశచరిత్రయందు సువర్ణాక్షరములతో లిఖింపఁబడఁగలదు. మరణమునకేని వెనుకదీయని ధైర్యగుణము తమబోంట్లకుండియుండినచో మనదేశమిట్లు పరాధీనముకాకయేయుండును. మఱియొకవిషయము చెప్పమఱచితిని. కారాగారములయందు జాతిభేదములకుఁ దావుండదే! అక్కడ బ్రాహ్మణుఁడు చండాలుఁడు కలిసి పనిచేయుచుండవలెను. కలిసి నిద్రించుచుండవలెను. కడకు మజ్జనభోజనాదులుగూడ కలిసియే చేయవలయునే! ఉన్నదా తమకట్టి త్యాగశక్తి? ఉన్నచో నింతటినుండియే కార్యారంభమునకుఁ గడంగుఁడు. ఇంతవరకు లేకయుండిన నేఁటినుండియే యీపనుల నభ్యసింపుఁడు. నేఁడిచటఁ జేరియుండు బ్రాహ్మణులును, నస్పృశ్యులును నొండొరులు ప్రేమాశ్లేషముల నాచరించి యెల్లరముఁ గారాగృహములకేఁగ సంసిద్ధులమై యున్నామని ప్రపంచమునకుఁ జాటుఁడు. లేదేని శారదాక్రేరారులెట్లు భయపడఁగలరు?"

అని యాఖద్దరువస్త్రధారియగు యువకుఁడు వచించుచుండునపుడే సనాతనధర్మపరాయణులగు ద్విజులు మండిపడుచుండిరి. వారినోరులు తుపాకిరూపుఁదాల్చి మాటలనియెడుగుండ్లను ప్రయోగించుచుండెను. శీఘ్రకాలములో నచటి కలకలమంతయు శాంతించెను. అంత జ్ఞానశూన్యులుగారు "శారదాక్రేరారులవలన మన మిసుమంతయు భీతిఁజెందనవసరములేదు. నేనిప్పుడే వారిని నీరుఁజేసివేయుచున్నా"నని వాక్రుచ్చి బల్లపైనున్న ఛాయాపటములకు నిప్పంటింపఁబోయిరి.

వెంటనే యాయువకుఁడాతని బెదరించుచు, "జాగ్రత్త! పటములకు నిప్పంటింపకుఁడు. ఒరులపటములఁ దగులఁబెట్టుట చట్టసమ్మతమగు గొప్ప నేరమగును. మీరిప్పుడే నిర్బంధింపఁబడుదురు. మీయుద్యమమంతయుఁ బాడగును. నిజముగాఁ గారాగారమునకేఁగఁ గోరుచో నీపని చేయుఁడనెను."



ఈవాక్యములు విని నంతనే యాచార్యుని శరీరమంతయు చెమటపట్టెను. కాలుసేతులు వడవడ వడకసాగెను. కాలుసేతులేగాక హృదయమును గొట్టుకొనుచుండెను. సంచలనము తొలుత నెచటఁబుట్టెనో మేము చెప్పఁజాలము. ఈవిషయమును నిర్ణయింప వైద్యులే సమర్థులు!

జ్ఞానశూన్యుఁడిటునటు పరికించి 'ప్రకాశం' అని పిలిచెను. వారు తమ సాకారుని ప్రకాశమని పిలిచిరే గాని వాడు మాత్ర మంధకారావృతుఁడై యుండెను. నిజముగా ప్రకాశమని పిలువఁబడఁదగినవాఁడాయెదుట నిలిచియుండు నవయువకుఁడే!

ఆయువకుఁడచటినుండి మెల్లగా నాచార్యునియొద్దకువచ్చి యాతని చేయిపట్టుకొని, "తమసాకారుని విషయము పోనిండు, నామాట వినుఁడు, తమరు వృథాక్రోధమును త్యజింపుఁడు. 'సంఘేశక్తిః కలౌయుగే' యనునార్యోక్తినిఁ దమరంగీకరింపరా? నిజమునకు నాల్గుయుగములయందును సంఘీభావముచేతనే మహత్కార్యము లాచరింపఁబడినవి. సాంఘికశక్తినివదలి వేఱొకబలమువలనఁ గార్యములొనరింపఁదలఁచుటయే యాత్మప్రతారణమనఁబడును. మన మీసమయమున సమస్తప్రాపంచికేతిహాసమువలననే యథార్థమగు ధర్మశక్తులలోని రహస్యముల నెఱుఁగజాలుచున్నాము. లెండు. నడుముకట్టుకొనుఁడు. ఆత్మసోదరులవలె నస్పృశ్యులతోఁ గలసిమెలసి యుందము. నావెంట రం'డనియెను.

పాపము! ఆచార్యులుగారాతని చేతినూఁతగా గొనియుండిరి. యువకుఁడాతని చండాలుర మధ్యకు చరచర నీడ్చుకొనిపోయెను. యువకులందఱు దీనులగు హరిజనులను గౌఁగిటఁ జేర్చిరి. సనాతనవాదులెల్లరు పంచములతోఁగూడి యుండిరి. జ్ఞానశంకరుఁడును నేత్రముల నశ్రుకణములురాల నొకహరిజనసోదరుని గౌఁగిలించియుండుటఁజూచి యువకులొక్కుమ్మడి "జై' జ్ఞానశంకరునకు జై"యని దిక్కులుపిక్కటిల్లఁ గేకలిడిరి. శారదాశాసనమునకు వ్యతిరేకముగ సభ ప్రారంభించిన జ్ఞానశంకరుఁ డస్పృశ్యతానిర్మూలనముతో ముగించెను!

—అనువాదము.